సాక్షి
చిత్తూరు
శనివారం । 4 । మే । 2024



పక్కా ఇళ్లపైనా అక్కసే..!
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన జగనన్న ఇళ్లపై ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోంది. - 10లో



ఓట్ల కోసమే బాబు మాయమాటలు
చంద్రబాబు ఓట్ల కోసమే మాయమాటలు చెబుతారని, నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తెలిపారు. - 10లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు
జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు పలమనేరుకు సీఎం వైఎస్ జగన్



పలమనేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పలమనేరుకు రానున్నారు. ఉదయం 12.30 గంటలకు ఆయన గంగవరం సమీపంలోని యూనివర్సల్ మైదానానికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అనంతరం బస్సులో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద చేరుకుని బహిరంగ సభలో మాట్లాడనున్నారు. శుక్రవారం ఈ మేరకు హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



స్వామి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని శుక్రవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమేష్ సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

చిత్తూరులో హెబ్బా పటేల్ సందడి



షాపు ప్రారంభోత్సవానికి వస్తున్న హెబ్బా పటేల్

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం సినీనటి హెబ్బా పటేల్ సందడి చేసింది. ఓ షాపు ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైంది. ఈ సందర్భంగా 'హాయ్ చిత్తూర్' అంటూ అభిమానులను పలకరించింది. అభిమానుల కోరిక మేరకు వారితో సెల్ఫీలు దిగింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన సినిమా విశేషాలను పంచుకుంది.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

బంగారుపాళెం:స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 3వ తరగతిలో 40 సీట్లకుగాను ఎస్టీలకు 32, ఎస్సీలు 5, బీసీలకు 2, ఓసీలకు ఒక సీటు కేటాయించినట్లు వెల్లడించారు. 4 నుంచి 9వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీల ను ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేయనునట్లు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిషు మీడియం వారిని లాటరీ విధానంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9989468202 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పింఛన్.. బాబు ముంచెన్!



సదుంలో బ్యాంకు వద్ద గుమికూడిన పెన్షనర్లు

ఇదివరకు ఒకటో తేదీ వస్తే పండుగ వచ్చినట్టుండేదని అవ్వాతాతలు గుర్తుచేసుకుంటున్నారు. వలంటీర్ ఇంటికి వచ్చి ఆత్మీయంగా పలకరిస్తే ఆనందంగా అనిపించేదని.. చేతికి పింఛన్ సొమ్ము అందగానే ప్రాణం లేచి వచ్చేదని వెల్లడిస్తున్నారు. అవసరాలు తీర్చుకునేందుకు ఎవరిపై ఆధారపడాల్సిన పనిలేదు అనే ధైర్యం వచ్చేదని తెలియజేస్తున్నారు.. ఇలా సాఫీగా సాగిపోతున్న మా జీవితాలను చంద్రబాబు కష్టాల కడలిలోకి నెట్టేశారని ఆవేదన చెందుతున్నారు. పింఛన్ నగదు కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితిని తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండే ఎండల్లో తిరగలేక ప్రాణం పోయేలా ఉందని వాపోతున్నారు. ఇంతగా తమపై కక్షగట్టడం ధర్మం కాదని.. తమ ఉసురు తప్పక తగులుతుందని స్పష్టం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



- పెన్షన్ డబ్బుల కోసం పండుటాకుల కష్టాలు
- బ్యాంకు చుట్టూ తప్పని ప్రదక్షిణలు
- మండే ఎండల్లో తిరగలేక నానా అవస్థలు
- ఎంత పనిచేశావు చంద్రబాబూ అంటూ కన్నీరుపెడుతున్న వృద్ధులు
- అవ్వాతాతల ఆపసోపాలు



ముసలోళ్లపై కనికరం లేదా



ఒకటోతారీకే మా ఇంటి వద్దకు వచ్చి వలంటీరు పింఛన్ ఇచ్చేసి పోయేవాడు. ఎన్నికల సాకుతో మాలాంటి ముసలోళ్లపై కనికరం లేకుండా చంద్రబాబు అన్నిటినీ అడ్డుకున్నాడు. ఇలా చేస్తే మేం ఏంచేసేది. బ్యాంకులో డబ్బులు వేశామన్నారు. ఎర్రటి ఎండలో అక్కడి పోతే జాతరలాగా ఉంది. ఎంత పొద్దుగునా జనం క్యూ కట్టారు. రెండు గంటలు క్యూలో ఉండి ఇక నిలబడే ఓపిక లేక ఇంటికి వచ్చేశా. మరుసటి రోజు వెళ్లినా అదే పరిస్థితి. రెండు రోజుల నుంచి తిరుగుతున్నా పింఛన్ డబ్బులు మాత్రం తెచ్చుకోలేకపోయా. ఇంకా ఎన్నాళ్లు మాకు ఈ కష్టాలు. మమ్మల్ని ఇంతగా ఇబ్బంది పెట్టిన చంద్రబాబు మాత్రం ఏం బావుంటాడు.

– సయ్యద్‌సాబ్, చౌడేపల్లె

ఎందుకు బాబూ ఇంత పగ



నడవలేక, కూర్చోలేక అవస్థలు పడుతున్న మాలాంటి వాళ్లపై ఎందుకు బాబూ ఇంత పగ. జగన్ పుణ్యమా అని ప్రతి నెలా ఇంటికే వచ్చి వలంటీర్ డబ్బులు ఇచ్చేవాడు. ఇప్పుడు మ కడుపు కొడితే చంద్రబాబు ఏం వస్తుంది. మాకు లేని కష్టాలు తెచ్చిన పాపం ఆయనకే తగులుతుంది. రాజకీయాలు చేయడానికి చంద్రబాబుకు మేమే దొరికామా. కేవలం ఓట్ల కోసం మా ప్రాణాలతో ఆడుకుంటున్నావు. ఇంతటి ఎండల్లో బయట తిరిగితే మేం బతికుంటామా. అది కూడా ఆలోచన చేయలేకపోయావ్. నిన్ను గెలిపిస్తే ఇంకే మంచి చేస్తావు. వీధిలోకే వెళ్లలేని స్థితిలో ఉండే ఇక బ్యాంకుల చుట్టూ ఎక్కడ తిరిగేది. చంద్రబాబుకు ఈ పాపం ఊరికే పోదు. మా శాపం కచ్చితంగా తగులుతుంది.

– అన్నెమ్మ, ఎగువ తవణంపల్లె

రెండు రోజులుగా తిరుగుతున్నా



ప్రతి నెలా వలంటీర్ ఇంటి కాడనే పింఛన్ తీసుకువచ్చి ఇచ్చేవాడు. ఈ రెండు నెలలుగా పింఛన్ డబ్బులు తీసుకోవడం చాలా కష్టతరంగా మారింది. మరీ ఇప్పుడైతే బ్యాంక్‌లో వేస్తామన్నారు. అక్కడకు వెళ్లి రెండు గంటలు క్యూలో నిలబడితే అకౌంట్ యాక్టివ్‌లో లేదని, మరుసటి రోజు రావాలని బ్యాంకు సిబ్బంది చెప్పారు. మళ్లీ వెళితే ఖాతాలో పింఛన్ పడలేదని తేల్చేశారు. దీంతో సచివాలయానికి వచ్చి అడిగితే వారు ఆన్‌లైన్‌లో చేసి మీ డబ్బులు బ్యాంకు ఖాతాలో పడ్డాయని చెప్పారు. తిరిగి బ్యాంకుకు వెళ్లి అర్జీ పెట్టుకున్నా. రెండు రోజులుగా ఆటోలో ఈ తిరుగుడుకే రూ.700 ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ పింఛన్ డబ్బు మాత్రం తీసుకోలేకపోయా. దీనంతటికీ కారణమైన చంద్రబాబును తలుచుకుంటేనే కడుపు రగిలిపోతోంది. మాపై ఎందుకు కక్ష గట్టాడో అర్థం కావడం లేదు. ఈ నెల ఇప్పటికీ మందులు కూడా తీసుకోలేదు. ఎండలో తిరుగుతుంటే చుక్కలు కనపడుతున్నాయి.

– నవాజ్ అహ్మద్, సంతపేట, చిత్తూరు

మా నోట్లో చంద్రబాబే మట్టి కొట్టాడు



నాకు 73 ఏళ్లు. కండ్లు సక్రమంగా కనిపించవు. కళ్లజోడు యెట్టుకుంటే తప్ప ఏమీ కనపడి సావదు. రెండు నెలల ముందు వరకు వలంటీరు పింఛన్ దుడ్డు ఇంటికాడికే తెచ్చి ఇస్తా ఉండాడు. ఇప్పుడు మా నోట్లో చంద్రబాబు మట్టికొట్టినాడు. నీకు ఆడ దుడ్డు పడి ఉండాది అంటే ఇప్పుడే బ్యాంకు పోయా. వాళ్లేమో నీ ఖాతా పనిచేయడం లేదు.. రేపు రా అన్నారు. ఈ ఎండ సూస్తే ప్రాణం పోయేటట్టు ఉండాది. ఈ చంద్రబాబు సేసిన పనికి పింఛన్ దుడ్డుకు ఆడా..ఈడా చుడతా ఉండాం. వలంటీరు పింఛన్ ఇస్తే..ఈ బాబు సొమ్ము ఏమైనా పోతా ఉండాదా. ఎందుకయ్యా మామీద నీకు ఇంత కసి. ముందుదా పింఛన్ సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినావ్. ఇప్పుడు ఇచేవాళ్లను చెడగొడుతుండావ్. ముసలోళ్ల మీద పగబట్టినావు కదా. బాబు రాజకీయం కోసం మాలాంటోళ్లను సంపేస్తుండాడు. మరీ ఇంత అన్యాయమా.

– సుందర్‌రాజ్, చిత్తూరు

మాకు మంచి చేసింది జగనే!



నిజం చెప్పాలంటే పోయిన ఎన్నికల్లో నేను అసలు జగన్‌కి ఓటు వేయనే లేదు. అయినా ఈ ప్రభుత్వంలోనే నాకు ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్ వచ్చేది. ఇప్పుడు మాకు చంద్రబాబు తగిన బుద్ధి చెప్పాడు. ఓటేసిన పాపానికి పింఛన్ అందకుండా చేశారు. డబ్బులు తీసుకోవాలంటే ఎక్కడి వెళ్లాలో కూడా తెలియని పరిస్థితి తెచ్చిపెట్టాడు. ఎర్రటి ఎండలో రోడ్లపై తిరగాల్సి వస్తోంది. బ్యాంకు వెళితే సచివాలయానికి వెళ్లమంటున్నారు. ఇక్కడకు వస్తే బ్యాంకుకు పొమ్మంటున్నారు. ఇలా తిరిగేందుకే ఆటోవాళ్లకు సగం డబ్బులు చదివించుకోవాల్సి వస్తోంది. పగవాళ్లకు కూడా మా దుస్థితి రాకూడదు. అయినా చంద్రబాబు ఇదేం పోయేకాలం.

– వి.కాంతమ్మ, వేపగుంట, పుత్తూరు మండలం

చంద్రబాబుకు మంచి గతి రాదప్పా



నేను సరిగ్గా నడవలేను, కాలు దెబ్బతింది. బేస్తవారం నాడు బ్యాంకీకి వస్తి. జనాన్ని చూసి ఇంటికెళ్లిపోతి. ఈ పొద్దు జనం ఇంకా జాస్తిగా ఉండిరి. ఆడ అడిగితే బ్యాంకు బుక్కులేదని సచివాలయానికి వెళ్లమని చెప్పిరి. కాలు ఈడ్చుకుంటూ మైలు దూరంలోని సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకున్నా. అయినా మాలాంటి వాళ్ల కడుపుమంట చంద్రబాబుకు తగలకుండా పోదు. మాపై ఎందుకాయప్పకి ఇంత కసో తెలీలా. ఆ చంద్రబాబుకు మంచి గతి రాదప్పా.

– లక్షుమమ్మ, నాగిరెడ్డిపల్లె, బైరెడ్డిపల్లె మండలం

చంద్రబాబు వల్లే ఈ కష్టాలు



ప్రతినెలా ఒకటోతారీఖున మాఇంటికొచ్చి వలంటీరు పింఛన్ ఇచ్చేవాడు. చంద్రబాబు పుణ్యమా అని అది కూడా అందకుండా పోయింది. ఆయన వల్లే మాకు ఈ కష్టాలు వచ్చాయి. మాలాంటి వాళ్ల ఉసురు చంద్రబాబుకు తప్పకుండా తగులుతుంది. నా వయసు 70 ఏళ్లు. మరొకరి సాయం లేకుండా ఇంటి నుంచి బయటకు కదలలేని పరిస్థితి నాది. మందులు, మాత్రలకు కూడా డబ్బులేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. బ్యాంకు దగ్గర గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కాటికి కాళ్లు చాపుకున్న ముసలోళ్ల మీద ఈ విధంగా కక్షగట్టడం చంద్రబాబుకు మంచిది కాదు. ఇలాంటి వాళ్లు అధికారంలోకి వస్తే పేదలకు ఇక జీవితం మీద ఆశ చంపుకోవాల్సిందే.

– ఎస్.ఖాసిం, కల్లూరు

మా శాపాలు తగులుతాయి



కడుపులో చల్ల కదలకుండా నెల నెలా పింఛన్ సొమ్ము తీసుకునేవాళ్లం. ఈ చంద్రబాబు కారణంగా మా బతుకు ఎర్రటి ఎండల పాలైంది. ఎక్కడ పింఛన్ తీసుకోవాలో తెలియక అగచాట్లు పడుతున్నాం. ఆయన ఒక్కడి రాజకీయ స్వార్థం కోసం రెండు నెలలుగా లక్షలాది మంది ముసలోళ్లను అవస్థలు పాలు చేస్తున్నాడు. మళ్లీ సిగ్గు లేకుండా ఆయనను గెలిపిస్తే పింఛన్ రూ.4వేలు చేస్తామంటూ అబద్ధాలు చెబుతున్నాడు. మమ్మల్ని ఇంతగా కష్టపెట్టిన చంద్రబాబును జీవితంలో నమ్ముతామా. మా కడుపు కొట్టినందుకు మా శాపాలు తగులుతాయి. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– గుర్రప్ప, పళ్లారిగానిమిట్ట, కుప్పం మండలం

బాబుతో ఎప్పుడూ కష్టాలే



ఒకప్పుడు చంద్రబాబు పాలనతో పింఛన్ తీసుకునేందుకు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మా కష్టాలు తీరాయి. ప్రతి నెలా వలంటీర్ మా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తా ఉండాడు. ఒకటో తేదీనే సొమ్ము చేతిలో పడిపోయేది. మేం చల్లగా ఉంటే ఆ చంద్రబాబుకు నచ్చదు కదా. అందుకే కక్షగట్టి మరీ సాధిస్తున్నాడు. ఇప్పుడు పింఛన్ డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నాడు. ఈ రోజు బ్యాంకుకు వెళితే అదేదో పనిచేయడం లేదు.. మళ్లీ రమ్మన్నారు. ఇదంతా ఆ చంద్రబాబు వల్లే జరుగుతోంది. ఆయనతో ఎప్పుడూ కష్టాలే. అప్పట్లో అధికారంలో ఉన్నప్పుడు ఇబ్బంది పెట్టాడు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా కష్టపెడుతున్నాడు. పేదలకు హాయిగా ఉంటే చంద్రబాబుకు నిద్రపట్టదేమో.

– రాజమ్మ, కూర్మాయిపల్లె, బంగారుపాళెం మండలం

ఆ దేవుడే శిక్షిస్తాడు



వలంటీర్లు ఉన్నప్పుడు మాకు చాలా సౌకర్యంగా ఉండేది. ప్రతి నెలా ఇంటికే వచ్చి పింఛన్ నగదు ఇచ్చేవారు. ఇప్పుడు చంద్రబాబు చేసిన పనికి నానా అవస్థలు పడుతున్నాం. సకాలంలో మందులు కూడా కొనుక్కోలేక, నిత్యావసర సరుకులు లేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. ముసలోళ్లనే కనికరం కూడా లేకుండా చంద్రబాబు ఇలా కక్ష తీర్చుకుంటారని అసలు అనుకోలేదు. ఇప్పుడు పింఛన్ తీసుకోవాలంటే నరకం కనిపిస్తోంది. ఇంతటి ఎండలో నడిచి వెళ్లి బ్యాంకుల దగ్గర గంటల తరబడి నిలబడి నగదు తీసుకోవాల్సి వచ్చింది. కుప్పంలో 30 ఏళ్లుగా ఇలాంటి దుర్మార్గుడిగా మేం ఓటేసింది అని అనుకుంటే నా మీద నాకే కోపం వస్తోంది. ఆయనకు పోయే కాలం వచ్చే మా ముసలోళ్ల ఉసురుపోసుకుంటున్నాడు. ఇలాంటి వాళ్లను దేవుడే తప్పక శిక్షిస్తాడు.

– వెంకటేష్, పళ్లారిగాని మిట్ట, కుప్పం మండలం

మా కడుపు మంట తగులుతుంది



రెక్కాడితే కానీ డొక్కాడని బతుకు మాది. నాలుగిళ్లలో పాచిపని చేసుకుంటూ జీవిస్తున్నా. నెల నెలా వచ్చే వితంతు పింఛన్ కాస్త చేదోడుగా నిలుస్తోంది. గతంలో ఇంటికే పింఛన్ డబ్బులను వలంటీర్ తెచ్చి ఇచ్చేవాడు. ఇప్పుడేమో బ్యాంకులో వేశామంటున్నారు. నాకు ఆరోగ్యం సరిగా లేదు. మరొకరిని తోడుగా తీసుకుని బ్యాంకుకు వెళితే నా ఖాతా ఉన్న బ్యాంకును మరోదాంట్లో కలిపేశారు అని చెబుతున్నారు. సచివాలయానికి వెళితే నా ఖాతాలోనే పింఛన్ పడిందని చెబుతున్నారు. ఏం చేయాలో.. ఎక్కడ మా డబ్బు తీసుకోవాలో తెలియడం లేదు. ఆ చంద్రబాబు వల్ల మాకు ఇన్ని కష్టాలు వచ్చాయి. భర్త, పిల్లలు లేక ఒంటరి జీవితం అనుభవిస్తున్న నాకు కాస్త ఆదరువుగా ఉండే పింఛన్ కూడా అందకుండా చేశాడు. మా కడుపు మంట ఆయనకు తప్పకుండా తగులుతుంది.

– అరుణ, ఓబనపల్లె, చిత్తూరు

ఇంత కక్ష సాధింపు అవసరమా



మా ముసలోళ్లపై చంద్రబాబుకు ఇంత కక్ష సాధింపు అవసరమా. ఇంత ఎండల్లో బ్యాంకుల చుట్టూ తిరగడం మాకు ఎంత కష్టంగా ఉంటుంది. ఆయన స్వార్థ రాజకీయాల కోసం మమ్మల్ని బలి చేస్తున్నారు. హాయిగా ఇంటి పట్టునే పింఛన్ డబ్బులు తీసుకునే మమ్మల్ని రోడ్ల పాలు చేశారు. వలంటీర్లను రానీయకుండా దుర్మార్గపు ఆలోచన చేశారు. పింఛన్ సొమ్ముతోనే ఇంటికి సరుకులు తెచ్చుకునేదాన్ని. మందులు కొనుక్కునే దాన్ని. బ్యాంకు మా ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ వయసులో అంతదూరం వెళ్లి బ్యాంకు దగ్గర క్యూలో నిలబడే ఓపిక లేదు. పింఛన్ డబ్బులు లేకుంటే పొట్ట నింపుకోలేను. మమల్ని ఇంతగా బాధపెట్టిన చంద్రబాబుకు దేవుడే తగిన బుద్ధి చెబుతాడు.

– సులోచనమ్మ, సీపీపల్లె, ఐరాల మండలం



సదుం : బ్యాంకులో బారులు తీరిన వృద్ధులు

నవరత్నాలతో సుపరిపాలన



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నవరత్న పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. శుక్రవారం మండలంలోని సింహరాజుపురం, బాలకృష్ణాపురం, మఠవలం, నిశ్శింకాపురం, ఆముదాల, అలమేలుమంగాపురం, పాలసముద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తన కుమార్తె, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇచ్చిన మాట నెరవేర్చడం, చెప్పింది చేయడమే జగనన్న నైజమన్నారు. చంద్రబాబు నాయుడు మాల, మాదిగలను చీల్చి చిచ్చు పెట్టారని ఆరోపించారు. ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా అని అవమానించారని మండిపడ్డారు. బీసీలకు సైతం చంద్రబాబు చేసిన మేలు ఏమీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలను ఓటు అడిగే అర్హత వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. చంద్రబాబు మాదిరిగా గారడీ విద్యలతో ప్రజలను మోసం చేయడం జగనన్నకు అలవాటు లేదని వెల్లడించారు. జాబు రావాలంటే బాబు రావాలి అంటూ ప్రచారం చేసుకుని 2014లో అధికారంలో వచ్చిన చంద్రబాబు ఎంత మందికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఎస్సీల అభ్యున్నతికి కేవలం రూ.35వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.70వేల కోట్లు వెచ్చించిందని వివరించారు. పేదలకు సకాలంలో సక్రమంగా సంక్షేమ పథకాలు అందాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.శివప్రకాష్ రాజు, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ తులసీయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సినీ నిర్మాత షణ్ముగం, ఆర్‌బీకే చైర్మన్ పోలయ్య, కో–ఆప్షన్ మెంబర్ వేలు, సింగిల్‌విండో డైరక్టర్ లిల్లీ, సర్పంచ్ అనురేఖ, శోభ, భాస్కర్‌రెడ్డి గాలి మహేష్ బాబు, అయ్యప్ప, నరసింహరాజు, నాయకులు త్యాగరాజ్, అజిత్‌కుమార్, సుబ్రమణ్యంరెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, మురళి, నరసింహన్, ప్రేమ్‌కుమార్, ఆనందన్, ప్రకాష్, కుమార్, చంద్రశేఖర్‌రాజు, షణ్ముగరెడ్డి, వరదరాజు, చిన్నవరదరాజు, సిద్ధమండడి, శరవణన్, కుట్టి, చిన్నపయ్యన్, లక్ష్మణన్, రాజామణి, అరుల్, బాబు, మనోహర్, ధనంజయన్, వాసురాజు, కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షణ్ముగం పాల్గొన్నారు.

నిజాయితీకి పట్టం కట్టండి



చాటలు కొనుగోలు చేస్తున్న మంత్రి రోజా



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో ముచ్చటిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా

నగరి: వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి నిజాయితీకి పట్టం కట్టాలని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో ఆమె పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోలో 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందుకే మేలు చేసుంటేనే ఓటేయండి అని ధైర్యంగా అడుగుతున్నామని వెల్లడించారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చిన హామీలను పరిశీలిస్తే ప్రతి ఒక్కరికి ఈ విషయం అర్థమవుతుందని వివరించారు. ప్రజలను ఏమార్చేందుకే చంద్రబాబు మేనిఫెస్టోను విడుదల చేస్తే, ప్రజలకు సేవ చేసేందుకే జగనన్న మేనిఫెస్టో ప్రకటించారని వెల్లడించారు. చిత్తశుద్ధితో పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే సంక్షేమం కొనసాగుతుందని తెలిపారు. దౌర్జన్యం, గూండాయిజం టీడీపీ వారికి అలవాటని విమర్శించారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎక్కడా గొడవలు జరిగిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ పాలనలో ఏం జరిగిందో పరిశీలిస్తే ఇది బోధపడుతుందని చెప్పారు. కాకవేడు ఆదిఆంధ్రవాడ ప్రజలకోసం టీటీడీ ద్వారా మాతమ్మ ఆలయాన్ని నిర్మింపజేశామని వివరించారు. 13వ తేదీన ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు బటన్‌పై నొక్కి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి వదిన లక్ష్మి, కౌన్సిలర్లు దయానిధి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, దేశమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, కో–ఆప్షన్ సభ్యుడు ఆనంద్‌కుమార్, నేతలు తేన్‌మొళి, శశికళ, అముద, బాబు, విజయ్, రవికుమార్, సత్య, సుబ్రమణ్యం, చంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైరిస్క్ కేసుల పర్యవేక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో గుర్తించిన హైరిస్క్ కేసుల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. గర్భిణులకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వేసవి నేపథ్యంలో క్యాంపులకు రాని గర్భిణులకు ఇంటి వద్దనే వైద్యసేవలు అందించాలని సూచించారు. ఇకపై కిల్కారీ యాప్‌లో గర్భిణుల వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని కోరారు. సమావేశంలో డీఐఓ రవిరాజు, అధికారులు గుణశేఖర్, జానకీరావ్ పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 5, 6 తేదీల్లో ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా నియోజకవర్గాల్లోని ఫెసిలిటేషన్ సెంటర్లలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ వేయవచ్చని సూచించారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



జగదీష్ మృతదేహం

చౌడేపల్లె : మండలంలోని కాటిపేరి ఎస్సీ కాలనీ సమీపంలోని బావిలో శుక్రవారం ఈతకు వెళ్లి కె.జగదీష్ (16) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు.. అన్నమయ్యజిల్లా మదనపల్లె మండలం బసినికొండకు చెందిన కె.రాజా కుమారుడు జగదీష్ కాటిపేరిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. స్థానిక యువకులతో కలిసి గ్రామానికి సమీపంలోని వ్యవసాయ బావికి ఈతకు వెళ్లాడు. బావిలోకి దూకిన యువకుడు ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో తోటి వారు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పుంగనూరు నుంచి ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు.

నాడు : టీడీపీ హయాంలో పేదలకు పక్కా ఇల్లు కలగానే ఉండేది. నిలువ నీడ లేనివారు వేల సంఖ్యలో ఉన్నా పట్టించుకోని పరిస్థితి. సొంతింటి కోసం ప్రజలు మండల కార్యాలయాలకు వెళ్లి ఎన్ని సార్లు దరఖాస్తులు చేసుకున్నా ఏ మాత్రం న్యాయం జరగని దుస్థితి. జన్మభూమి కమిటీల కనుసన్నల్లో తమ పార్టీ వారికే పక్కాగృహాలను మంజూరు చేసేవారు. దీంతో లక్షలాది మంది నిరుపేదలు అద్దె ఇళ్లలోనే నివసించేవారు.

నేడు : ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద మహోన్నత కార్యక్రమం చేపట్టింది. నిరుపేదల ఆవాసాల కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చించింది. ఈ క్రమంలో ముందుగా సొంత గృహాలు లేనివారిని వలంటీర్ల సాయంతో గుర్తించింది. లబ్ధిదారులు ఎక్కడకూ తిరగాల్సిన అవసరం లేకుండా పక్కా ఇళ్లను మంజూరు చేసింది. ప్రతి గ్రామంలో ప్రత్యేకంగా కాలనీలను ఏర్పాటు చేసి పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించింది. పేదల సొంతింటి కలను సాకారం చేసింది.

- చరిత్రలో నిలిచేలా నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు
- టీడీపీ పాలనలో ప్రదక్షిణలు చేసినా నెరవేరని ప్రజల సొంతింటి కల
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,38,877 గృహాల నిర్మాణం
- మహత్తర పథకంపై ఎల్లోమీడియా విష ప్రచారం



ప్రభుత్వం నిర్మించిన పక్కా గృహాలు

ఈనాడులో ప్రచురితమైన కథనం

పక్కా ఇళ్లపైనా అక్కసే..!

చిత్తూరు కలెక్టరేట్ : గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,38,877 పక్కా ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రూ.రూ.1641.73 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిపింది. ఒక్కో లబ్ధిదారునికి పక్కా ఇంటి రూపంలో రూ.10 లక్షల మేర స్థిరాస్తిని సమకూర్చింది. ఇది ఓర్వలేని చంద్రబాబు ఈ మహోన్నత పథకంపై ఎల్లోమీడియా సహకారంతో బురదజల్లేందుకు యత్నిస్తున్నారు. బాబుకు మేలు చేయడమే లక్ష్యంగా ఈనాడు పత్రిక యథేచ్ఛగా అసత్య కథనాలను ప్రచురిస్తోంది. అందులో భాగంగానే ×నయవంచక నాయకా¥ అనే శీర్షికతో వక్రరాతలకు పాల్పడింది. తప్పుడు వివరాలతో ప్రజలను పక్కదారి పట్టించేందుకు తెగబడింది.

సమాచారం

చిత్తూరు జిల్లాలో	
నిర్మాణం చేపట్టిన ఇళ్లు	: 69,921
పూర్తయినవి	: 44,445
వెచ్చించిన మొత్తం	: రూ.948.77 కోట్లు
తిరుపతి జిల్లాలో నిర్మాణం	
చేపట్టిన గృహాలు	: 68,956
పూర్తయినవి	: 21,596
ఖర్చుపెట్టిన మొత్తం	: రూ.696.92 కోట్లు

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



ప్రస్తుత ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఇల్లు పూర్తి చేసుకోగలిగా. అధికారులే దగ్గరుండి ఇసుక, ఇతర సామగ్రిని తక్కువ ధరలకు ఇప్పించారు. ఇంటి పట్టా ఇచ్చినప్పటి నుంచి ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు మాకు అండగా నిలిచారు. ఈ ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉంది. గతంలో ఎలాంటి స్థిరాస్తి లేని నాకు ప్రస్తుతం రూ.10 లక్షల ఆస్తి ఉందంటే కారణం ఈ ప్రభుత్వమే.

- చంద్రలేఖ, వడమాలపేట మండలం

వీళ్లకు కళ్లు కనబడలేదా



గతంలో ఏ నాయకుడు మా సమస్యలను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాకే మాకు మేలు జరిగింది. నా భర్త మేస్త్రీ. అందరికీ ఇళ్లు కట్టిస్తావు మన కంటూ సొంతిల్లు ఎప్పుడు కట్టుకునేది అని ఇబ్బంది పెట్టేదాన్ని. స్థలం కొందామంటే అంత స్తోమత మాకు లేదు. ఈ ప్రభుత్వమే సొంత స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం చేసింది. గత ప్రభుత్వంలో చాలా ఏళ్లు ఇంటి స్థలం కోసమే కాళ్లు అరిగేలా తిరగాం. ప్రస్తుత ప్రభుత్వంలో పట్టా చేతికందింది. ఇల్లు కంటి ముందు కనిపిస్తోంది. తప్పులు చెప్పే వారికి కళ్లు కనబడలేదా.

- ఈశ్వరి, పుత్తూరు మండలం

సర్కారు పుణ్యమే



కూలి పనులు చేస్తేనే మా పొట్ట నిండుతుంది. ఇక సొంతిల్లు కట్టుకోవాలంటే మా వల్ల అయ్యే పని కాదు. ఏదో ఒక పనికి వెళితేనే ఆదాయం వస్తుంది. వచ్చేడబ్బు కాస్తా కుటుంబం పోషణకే సరిపోతుంది. సొంతంగా ఇల్లు కట్టుకోలేక 15 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉండేవాళ్లం. అద్దె పెంచితే అద్దె తక్కువ ఉన్న ప్రాంతానికి మారిపోయేవాళ్లం. ఇలా మూడు ప్రాంతాలకు మారాం. నెలకు రూ.1,500 అద్దె చెల్లించే నాటి నుంచి రూ.3,500 వరకు అద్దె చెల్లించాం. ఈ ప్రభుత్వం చేసిన మేలు వల్లే సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం సొంతింట్లో ఉన్నామంటే ఈ సర్కారు పుణ్యమే.

- వెంకటేశులు, పద్మావతినగర్, నగరి

ఓట్ల కోసమే..



కూలీనాలీ చేస్తేనే మాకు జీవనం కొనసాగుతుంది. సొంతంగా ఇల్లు కట్టుకోవాలంటే స్థలం కొనే స్తోమత మాకు లేదు. ఎప్పటికీ సొంతంగా ఇల్లు కట్టుకోలేమని నిరాశలో ఉండిపోయాం. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రభుత్వం హామీని నెరవేర్చి సొంతిల్లు కట్టుకునేందుకు సహాయం చేసింది. అలాంటి ప్రభుత్వంపై చంద్రబాబునాయుడు, వారి అనుకూల మీడియా ఓట్ల కోసమే దుష్ప్రచారంచేస్తోంది. వాటిని ఏ మాత్రం నమ్మం. రూ.లక్షల విలువ చేసే స్థలంలో సొంతిల్లు కట్టించింది ఈ ప్రభుత్వమే.

- మల్లేశ్వరి, పద్మసరస్సు, ఎస్టీ కాలనీ, కార్వేటినగరం.

మేలు చేసిన వాళ్లపై నిందలా



నా భర్త రాజేంద్ర రైలులో చిరువ్యాపారం చేస్తుంటారు. వచ్చే అరకొర డబ్బుతో జీవనం సాగిస్తుంటాం. 20 ఏళ్ల క్రితం పొట్టకూటి కోసం తమిళనాడు నుంచి కుప్పానికి వచ్చాం. అప్పటి నుంచి ఇక్కడే ఉండిపోయాం. గత సర్కారులో మాకు ఎలాంటి మేలు జరగలేదు. ప్రస్తుతం మేలు చేసిన ప్రభుత్వంపై నిందలు వేయడం సరైన పద్ధతి కాదు. నాకు ఇద్దరు పిల్లలు. చూస్తూనే పిల్లలు పెద్దగా అయిపోతున్నారు. ఇల్లు కట్టుకునే స్తోమత లేక పూరి గుడిసెలోనే ఇన్నేళ్లు గడిపాం. గతంలో అధికారులకు ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత లేదు అని చెప్పి తిప్పి పంపేశారు. ప్రస్తుత ప్రభుత్వం మాకు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి సాయం చేసింది.

- శశికళ, లబ్ధిదారు, కుప్పం.

గతంలో ఇంటి స్థలమే ఇవ్వలేదు



గతంలో ఇంటి స్థలం కావాలని ఎన్నో సార్లు మండల అధికారులకు వినతి పత్రం అందించాం. ఎన్ని సార్లు ఇచ్చినా పట్టించుకుని ఉంటే ఒట్టు. ఇంకెప్పటికీ మాకు ఇంటి స్థలం ఇవ్వరులే అని ఆశలు వదిలేశాం. స్థలమే ఇవ్వని వారు ఇంక గృహ నిర్మాణం ఎలా చేయిస్తారులే అనుకుని అద్దె ఇంట్లోనే ఉండేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీరు మా ఇంటి వద్దకు వచ్చి మా వివరాలు తీసుకున్నారు. మేము ఏ కార్యాలయానికి వెళ్లకుండానే మాకు స్థలం పట్టాను తెచ్చిచ్చారు. ఇచ్చిన స్థలంలో పక్కా ఇంటిని కూడా ఈ ప్రభుత్వమే కట్టించింది. ఇంత మేలు చేసిన ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం సబబు కాదు.

- ఫజానా, తగ్గువారిపల్లె, బంగారుపాళ్యం మండలం.

సీఆర్‌పీఎఫ్ జవాన్ ఆత్మహత్య



సురేష్ మృతదేహం

పలమనేరు : సీఆర్‌పీఎఫ్ జవాన్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పలమనేరులో వెలుగుచూసింది. వివరాలు.. బంగారుపాళెం మండలం మిట్టూరు పంచాయతీ పామిరివాండ్లపల్లెకు చెందిన సురేష్(40) మణిపూర్‌లోని ఇంఫాల్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తునానరు. ఏప్రిల్ 26వ తేదీన గ్రామంలో తన మరదలి పెళ్లికి వచ్చారు. ఈనెల 1వ తేదీన మళ్లీ ఇంఫాల్‌కు బయలుదేరారు. తాను బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నానని విమానం మిస్ అయిందని ఇక్కడే ఉండి వెళతానని కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. అయితే ఒకటో తేదిన పలమనేరు పట్టణంలోని గుండుబావి సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం లాడ్జిలో సిబ్బంది పిలిచానా తలుపు తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన సిబ్బంది వేరే తాళంతో తలుపు తెరిచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ సురేష్ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నట్టు తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

రొంపిచెర్ల: అనుమానంతో తన భర్త వేధిస్తున్నాడంటూ భార్య శుక్రవారం రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. స్థానిక పాళ్యంవీధికి చెందిన ఎస్.సబీహాకు 15 ఏళ్ల క్రితం చిత్తూరు రామనగర్‌కాలనీకి ఎస్.బషీర్‌తో వివాహమైంది. వీరి కాపురం కొన్నేళ్ల పాటు సజావుగా సాగింది. ఇద్దరు కుమారులు జన్మించారు. అయితే నాలుగేళ్ల క్రితం భార్యపై అనుమానంతో బషీర్ ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమె తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. తర్వాత ఈ ఏడాది జనవరిలో పెద్ద మనుషులు ఇరువురికీ రాజీ కుదిర్చారు. అయితే బషీర్‌లో ఎలాంటి మార్పు రాలేదు. భార్యను నిత్యం అనుమానిస్తూ వేధించడం ప్రారంభించాడు. దీంతో ఆమె 15 రోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో శుక్రవారం సబీహ భర్త బషీర్, ఆడపడుచులు షాహీనా, షబీనా, భర్త స్నేహితుడు కానిస్టేబుల్ నాగరాజా వచ్చి ఆమెపై దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సుకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్ల కోసమే బాబు మాయమాటలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

గుడుపల్లె : కుప్పం నియోజకవర్గ ప్రజలకు కేవలం ఓట్ల కోసమే చంద్రబాబు 35 ఏళ్లుగా మాయమాటలు చెబుతున్నారని, ఈ పర్యాయం అబద్ధాల బాబును సాగనంపాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చీకటిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు చెప్పే మోసపూరిత మాటలను నమ్మి ఈసారి మోసపోవద్దని కోరారు. ఓట్లు కోసం జనాన్ని మభ్య పెట్టి అమలు చేయలేని పథకాలను చెప్పి ఓట్లు దండుకుని ఎగనామం పెడతారని హెచ్చరించారు. చంద్రబాబుకు బుద్ధి చెప్పాలంటే ఓటు ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు అసమర్థత కారణంగానే కుప్పం ప్రాంతానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, మంచి కళాశాలను కూడా నిర్మించలేదని ఆరోపించారు. ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న చేపట్టిన పథకాలే శాశ్వతంగా నిలిచారని వెల్లడించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రజల కోసం అమలు చేయలేదని విమర్శించారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ నాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పకు ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్, పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణ, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ



భరత్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేతలు

గంగవరం : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. అందులో భాగంగా శుక్రవారం గంగవరం మండలం గండ్రాజుపల్లె పంచాయతీ మార్లపల్లెలో ముస్లిం మైనారిటీకి చెందిన 6 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జహంగీర్, దస్తగిరి, ఉజీవుల్లా, హస్సాన్, ఎగ్బాల్, ముబారక్ తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ముస్లిం మైనారిటీలకు న్యాయం జరిగిందని, చంద్రబాబు ఏనాడూ ముస్లింలను పట్టించుకోలేదని తెలిపారు. అందుకే టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వెల్లడించారు.

కుప్పంలో..

కుప్పం : శాంతిపురం మండలం కొలమడుగు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ముని వెంకటప్ప , సుబ్రమణ్యం, బాలాజీ ఉన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బరాజు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పీఏసీఎస్ చైర్మన్ మునిరత్నంగౌడ, శ్రీరాములు, మణి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటివారిపల్లె పంచాయతీ కేఎన్ దళితవాడకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పుంగనూరు టీడీపీ నేత చల్లా సుప్రియా రెడ్డి బలవంతంగా గురువారం టీడీపీ కండువాలు వేశారు. అయితే మాకు టీడీపీ కండువాలు వేసుకోవడం ఇష్టం లేదంటే సదరు నేతలు గిరి, శేఖర్, చంటి, కవిత, సుకన్య, రాజు, ప్రసాద్, నిర్మల తెలిపారు. ఈమేరకు శుక్రవారం మళ్లీ జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్ రెడ్డి, చిరంజీవి, ద్వారకనాథరెడ్డి, మునస్వామి నాయుడు పాల్గొన్నారు.